

అయిదడుగుల పొడవున్న మట్టి ప్రహరీ గోడను దాటి యింటి ఆవరణలోకి అడుగు పెట్టాడు నటరాజు.

బాగా ముందుకొచ్చిన పూరింటి చూరు కింద, దిన్నె పైన కూర్చుని పగ్గం పేదుకుంటున్న గంగులు నాయుడు తలపైకెత్తి "రా అయివోరా రా! యిదేనా రావటం?" అంటూ పలకరించాడు.

# అత్యాచారం

## - మధురాంతకం నరేంద్ర

యింటి ముందున్న పందిరి నీడలో కొచ్చి నిల్చున్నాడు నటరాజు.

మోకాళ్ల దాకా పంచెను పైకి లాక్కుని గొంతుక్కూర్చున్న గంగులు నాయుడు, పేడిన దారాన్ని పాదం కింద అణిచిపెట్టి, రెండు చేతులతో మిగిలిన దారాన్ని పురి తిప్పుతూ, అలాగే కొంచెం ముందుకు వొంగి, ఇంటి లోపలికి తొంగి చూసి "అమ్మీ! ఆ మంచమట్లా వాల్చు. అయివోరు కు చ్చుంటారు" అని కేకేశాడు.

"పర్వాలేదులే నాయుడూ! తోటాకసారి చూసి పోదామని వచ్చినాను..." అన్నాడు నటరాజు.

"పది గంటల బస్సు హోరను యినపడినప్పుడే అనుకున్నాను, యీపొద్దు మీరెవురైనా వస్తారని. కుచ్చో అయివోరా! యెండలో బడి వచ్చినావు. కొంచెం దాహం తీసుకో! తోపుకాడికి నేనూ వస్తాను..." కళ్లెగరేసి అదోలా నవ్వుతూ అన్నాడు గంగులు నాయుడు.

రాకుండా యెక్కడ పోతావని వెక్కిరించినట్టుగా వుంది ఆ నవ్వు. గంగులు నాయుడెప్పుడు మాటాడినా యెద్దేవా చేసినట్టే వుంటుంది. అందుకే యెప్పుడూ అతడి యెదుట పడకుండా తప్పించుకోవాలని వుంటుంది నటరాజుకు. ఈ ముసలాయినతో మాత్రం కొంచెం జాగ్రత్తగా వుండమని ఆసామి హెచ్చరించాడు కూడా! అయినా అప్పుడప్పుడూ

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

యిలా చిక్కుకుపోతూనే వున్నాడు తాను.

ఆరడుగుల పొడవున్న గంగులు నాయుడి ఛాతీపైనా, చేతులపైనా, కాళ్లపైనా తెల్లటి రోమాలు దట్టంగా కనిపిస్తున్నాయి. నెత్తి పైన మాత్రం జుట్టు పలచబడింది. నల్లటి అతడి నుదిటి పైనా, మెడపైనా చెమట బిందువులు పొటమరించి వున్నాయి.

గుడిసెలోంచీ బయటికొచ్చిన పాతికేళ్ల అమ్మాయి మంచం వాల్చి, దానిపైన జంబుఖానా పరిచి లోపలికెళ్లిపోయింది. చొక్కా బటన్లు తీసి, రుమాలుతో వుఫ్‌మని వూదుకుంటూ, అలాగే మంచంపైన సోలిపోయాడు నటరాజు. అయిదు నిముషాల తరువాత పెద్ద గ్లాసు నిండా మజ్జిగ తీసుకొచ్చి ఇచ్చిందామె. దాహం తీర్చుకున్న తరువాత ఖాళీ గ్లాసు కిందపెడుతూ "లోకంలో వుండే యెండంతా మీ వూర్లోనే కాస్తా వుండేటట్టుంది. గంటయినా పదకొండు కూడా కాలేదు. యెండప్పుడే అగ్గి మాదిరిగా మండిపోతా వుంది... అయినా మీ వూరి కొచ్చేదానికంటే ఢిల్లీకి పొయ్యేది కూడా సులువే!" అన్నాడు నటరాజు.

"వొకదినానికే చేతులేత్తేస్తే యెట్లయివోరా? దినామూ ఈ బస్సుల్లోనే, ఈ రోడ్లల్లోనే తిరిగేటోళ్లు కూడా మడుసులేలే! అయినా ఆసామే వస్తాడని అనుకున్నాను. ఆ పెద్ద మనిషినే అంపించుంటే పొయ్యేది గదా! నీకీ బస్సుల బాధా వుండదు. ఆయనైతే నేరుగా జీబులో బుయ్యిమని తోటకాడికే వచ్చేసుండచ్చు" సాగదీశాడు నాయుడు.

"వ్యాపారం చేసే ప్రతి తోట దగ్గరికీ ఆసాములే తిరగాలంటే అయ్యేపనా పొయ్యేపనా చెప్పు నాయుడూ!" అతడి కర్థమయ్యేలా నటరాజు నెమ్మదిగా విడమర్చి చెప్పసాగాడు - "మా ఆసామి నీ దొక్క తోట మాత్రమే కొన్నాడనుకుంటా వుండావా నువ్వు? పచ్చి కాపలం దగ్గిర ఆరు తోటలు, భాకరాపేట దగ్గిర యెనిమిది... యింకా భీమారం దగ్గిర రెండు పెద్ద తోటలు, రెండు లేద్తోటలు, సోమల దగ్గిర మూడు... మొత్తం యెన్ని తోటలో నాకే లెక్క తెలియదు. మేము గుమాస్తాలే ఆరుమందుండాం. ఆరు మందీ ఆరు పక్కలకు పోయి అన్నీ చూసుకోవాల... యాశేవూరు పక్కుండే తోటలన్నీ నేనొంటిగాణ్ణే చూసుకోవాల. మొన్న, అంటే సోమవారం వూరొదిలినోడ్ని, నిన్నంతా మిట్టూరు కాడుండే తోటల కాడికి తిరిగేదానికే సరిపోయింది. యీ పొద్దు మీ తోట జూసుకోని, వూరికి పొయ్యి ఆసామికి సమాచారాలు చెప్పాల..."

పూర్తయిన పగ్గాన్ని నిగ్గదీస్తూ "యీ వ్యాపారం చేసేటోళ్లని చాన్నాళ్ల నించీ చూస్తా వుండాన్లే అయివోరా..." అంటూ తానూ తగిన సమాధానాన్నే సరఫరా చేయసాగాడు నాయుడు. "మా నాయన అయాంలో మేము తోటల్ని అమ్మిందీ లేదు. కొంటామని వొచ్చినోడూ లేదు. యిదంతా నా కండ్ల ముందర్నే మొదులయిన భాగోతం. సుగంపేట సులేమాన్ సాయిబును తెలుసునా నీకు? టవున్లో సినిమా టాకీసును కూడా కట్టినాడంటనే యీ మధ్యన ఆయన. ఆయన మా తోటను మొదుట్లో కొనింది. అప్పుడ్నించీ సమత్సరం పంట లెక్కన రెండు మూడేండ్లకు అడమాణాల లెక్కన అమ్మతానే వుండాను. యెంతమంది యాపారుల్ని చూసినా ననుకుంటా వుండావు? షిద్దేకు సాయిబు, క్రిష్ణమనాయుడు, చిన్న రామయ్య, రాఘవరెడ్డి... నీకు వోపికుండాల్నే గానీ అందురి జాతకాలూ చెప్పేస్తాన్నీకు. కానీ మీ సిద్దముని మాదిరి మోసమయిన ఆసామిని యింతదాకా నేను చూళ్లేదు. వచ్చినప్పుడు అరిచెయ్యిలో సొర్గం చూపించేసి పోతాడు. మళ్లీ పక్కకు తొంగి కూడా జూడడు. బేరాల నాడేమో దుడ్డంతా వొకసారిగానే యిస్తానని చెప్పినాడా? మల్లంక సగం దుడ్డు సీజనయినాక యిస్తానన్నాడా? రూకలదేముందిలే, మనిషి కంటేనా అనుకుంటిని. చేనులో బోరింగేయాలంటే వాళ్ల స్నేహితుడెవుడో బోరింగు లేసే ఆయన్ను అంటించినాడా? ఆ పెద్ద మనిషొచ్చి రెండు పాయింట్లు జూపించి, వొక చోట నూట యాభై అడుగుల దాకా పైపులు దించేసి మళ్లా వస్తానని చెప్పి వక్కా బోయినాడు. యింతదాకా అయిపు లేదు. పది వేలు నష్టం. పోనీలే, యింకో పాయింటు కాడయినా బోరింగేసి సూద్దామని అనుకుంటా వుండాము. దేనికీ మనిషి కనిపిస్తే గదా? ఆ కావిలోళ్లతగరారు తగరారుగానే వుండాది..."

"ఆ తగరారు సంగతి తేల్చుకోని పోదామనే వచ్చినాన్నేను..." అతడ్ని మరో మాట మాటాడనివ్వకుండా అడ్డు తగిలాడు నటరాజు.

నాయుడు పైకి లేచి తాడునూ, గోగునారనూ జాగ్రత్తగా వామిలోకి చెక్కాడు.

యిద్దరూ ప్రహరీ గోడ దాటి వీధిలోకి వచ్చారు.

వూరి కటువైపు చివర్లోని బోరింగు పంపు ముందు అయిదారుమంది ఆడవాళ్ల గుంపు కనబడుతోంది. పదేళ్ల వయస్సున్న ఆడపిల్లొకతె తన కంటే పెద్దదిగా కనబడుతున్న బిందెను చంకనెత్తుకుని వీధిలో నడుస్తోంది. గ్రీసు మరచిన బోరింగు పంపు పిచ్చి కుక్క పిల్ల కూతల్లా కర్ణ కఠోరమైన శబ్దాల్ని ప్రసారం చేస్తోంది.

వూరి కిటువైపున్న రచ్చ బండపైన వొకే వయస్సు వాళ్లలా కనబడుతున్న యువకులు బీడీలు కాల్చుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

నాయుడు మామిడికాయల వ్యాపారం చేసే ఆసాములతో తనకున్న అనుభవాల్ని యేకరువు పెడుతూనే, వూర్లోంచీ పొలాల వైపు కెళ్లే బండి బాటపైన నడవసాగాడు - "మీ యాపారులకు బేరమాడేటప్పుడుండే అక్కర, అణకవ అగ్గిరిమెంటయినాక వుండదు. బేరాలప్పుడు అందురూ అరిచ్చెంద్రుల్లే! అసలు తోటను అయిదేండ్లకు అడమాణం పెట్టిందే నా బుద్ధి తక్కువ. యేందో రూకలంతా మొత్తంగా చేతిలో పడతాయి గదా అని మా పెద్దోడి మాట కొప్పుకుంటిని. అయిదారు మంది యాపారులు తోటను పెట్టుకుంటామని పై బేరాలకు దిగినా మీ సిద్దమునికే యెందుకిచ్చినాననుకుంటా వుండావు? ఆ షుక్కూర్ సాబు నలభై వేలిస్తాననా. కానీ మీకు ముప్పయి అయిదుకే వొప్పుకుంటిని గదా? యాలనో చెప్పు? మీ ఆసామి బోరింగులేసే స్నేగితుడుండాడని చెప్పినాడు. మా చేన్లో అయిదార్పు మిషను యిరవై నాలుగ్గంటలూ గుయ్యిమని మోగేటట్టు చూస్తానని ప్రమాణ పూర్తిగా చెప్పినాడు. అందుగ్గదా వొప్పుకుంటిని! అసలు మీ ఆసామి యే పనయినా వొప్పారం లేకుండా చేసినాడా చెప్పు? తోటకు మందులు గొట్టేటప్పుడు కాపలా మనిషిని యేర్పాటు జెయ్యమని నాతో చెప్పేసి పోయిన పెద్ద మనిషి, ఆ మాటపైనే వుండాల్నా, వద్దా? నేనేమో అష్ట కష్టాలు పడి, మా వోడ్నే వొక్కడ్ని, మంచోడ్ని, యేర్పాటు చేసి, వాని కుటుంబరం వుండే దానికి తోట్లోనే సపారెయ్యించి అన్నీ చేస్తిని గదా? పద్దెద్దినాలు అయ్యాగాక ముందే మీ ఆసామి యింకో కాపలా

కష్టపడి పని చేయమన్న సిద్ధముని సలహా వినగానే నటరాజు ఉలిక్కిపడ్డాడు. తన ఊళ్ళో కోటలాంటి పెద్ద గారమిద్దెను కట్టించుకున్న పెద్దినాయుడు గుర్తుకొచ్చాడతనికి. ఉన్న ఆస్తుల్ని పంచుకుని మిగిలిన భూముల్తో పోరాటం సల్పుతున్న గంగులునాయుడి సంతానమూ, రామచంద్రుని కుటుంబమూ జ్ఞాపకం వచ్చింది. సిద్ధముని తండ్రికి లెక్కలు రాసిపెట్టి తెలివైనవాడని పేరు తెచ్చుకున్న తన తండ్రి మనస్సులో మెదిలాడు. ఊర్లకు దూరంగా తోటల్లో జంతువుల్లా జీవిస్తూ, నిప్పులాంటివాళ్ళ మనుకునే తమ వంశ గౌరవాన్ని నిలబెడుతున్న శ్రమజీవనం గుర్తుకు రాగానే నటరాజు కదలిపోయాడు.

మనిషిని పంపించేదేం న్యాయం చెప్ప? ఆ వొచ్చినోడు యెట్లాంటోడు? పలాతనోడు. వాడూ వాని పెండ్లాం తోట్లో చేరుకోని కదలకుంటే కదలమనిరి. వొకే తోటకు యిద్దురు కాపలా వాల్లా? వచ్చి తగరారేందో త్తేల్చుకోని పొమ్మంటే, మీ ఆసామికి తీరికే లేదని గుమస్తాలంటారు. యిప్పుడు యిద్దురు కాపలా మనుషులుకూ జీతాలియ్యాల్సింది మీరే గదా! నాదేం పొయ్యింది?..."

గంగులు నాయుడి మాటల్ని అన్యమనస్కంగానే వింటూ, వోసారి వెనక్కు తిరిగి వూరి వైపుకు చూసి "నూరిండ్లుంటాయా మీ వూర్లో?" అంటూ మాట మార్చడానికి ప్రయత్నించాడు నటరాజు.

తన మాటలు యీ కుర్ర గుమాస్తా గాడికి రుచించడం లేదన్న విషయం నాయుడికర్థమైన ట్టుంది. వో నిముషంసేపు మౌనంగా వుండి పోయాడు. తరువాత "ప్చ్" అని పెదవులు చప్పరించి "నూరేదుండాయి? మొత్తం యెనభై గడప లుంటాయేమో! మా నాయుళ్ళ యిండ్లొక ముప్పయ్యి, పది రెడ్ల కుటుంబరాలు, యింక ఆచార్లూ, బలిజోల్లు అంతా డెబ్బయి యెనభై గడప లుంటాయి..." అని సమాధానం చెప్పాడు.

"మీ వూర్లో వొకేవొక మిద్దిల్లుండాది... ఆ పడమర పక్కుండే ఆ మిద్దెవురిది?" — నాయుడ్ని గుక్క తిప్పకోనివ్వకుండా మరో ప్రశ్నను అడిగాడు నటరాజు.

"అదా?... వొకప్పుడు మాదే!" నాయుడు మెల్లగా, అదోలా నవ్వేశాడు. "పదేండ్లొచ్చేదాకా ఆ యింట్లోనే వుంటిమి మేము. దాని పేరే పెద్దినాయుడి మిద్దె.. అదే మా తాత పేరు. ఆయన అయాంలో జమిందార్ల మాదిరిగా బతికినాంలే! యిరవయ్యేకరాల మడీ, పదైదెకరాల చేమ, యిరవయ్యేకరాల మామిడి తోట... మా నాయనావాళ్ళు నలుగురు. అంతా భాగాచారాలు పోయినాక మా నాయిన మాత్రం ఆ యిల్లొద్దనేసినాడు. మా పెద్ద నాయనోళ్ళు ముగ్గురూ ఆ యింట్లోనే అడ్డంగా గోడలు కట్టుకొని వున్నారు. పోయిన సమత్సరం దూలాలు పడిపోతే, అందరూ వేరే వూరిండ్లు కట్టుకున్నారు. యిప్పుడాయింట్లో మడకలూ, గంపలూ పాడూ పెట్టుకుంటా వుండారు..."

బండి బాట కిరువైపులా చీకి చెట్ల పొదలు విచ్చలవిడిగా పెరిగి వున్నాయి. బండరాళ్ళ కాఠిన్యాన్ని స్ఫురణకు తెస్తున్న ఎర్రటి బీళ్ళ మధ్య, అక్కడక్కడా, బోరింగులకు నీళ్ళందిన ప్రదేశాల్లో, చినిగిన బట్టలకు వేసిన అతుకుల్లా పచ్చని పొలాలు... అక్కడక్కడా చింతచెట్లు, యీత చెట్లు...

నాయుడు చెప్పకుపోతూనే వున్నాడు — "ఆ చింత చెట్టుకాడుండే పదైదెకరాల చేమా వొకప్పుడు మాదే! యీ పక్క ఆ మిషెను షెడ్డు కాడుండే యిరవయ్యేకరాల మడి చెక్క గూడా వొకప్పుడు మాదే! చెప్పినాను కదా! మా తాతకు మా నాయనోళ్ళు నలుగురు. మా నాయనకు మేమిద్దురు... భాగాలు పోమా పోమా యిప్పుడు నాకు మిగిలింది రెండెకరాల మడీ, రెండెకరాల చేమా, రెండున్నర యెకరాల మామిడితోపు... నాకు పెండ్లయ్యిందాకా మామిడి బీడు నింది లేదు. చెరువు నిండిందంటే రెండు ఫలితాలకు భయం లేకుండా వునింది. కొన్ని సమత్సరాలు వొక పంటతోనే కాలం గడిపితిమి. యిప్పుడా చెరువులోకి నీళ్ళొచ్చి రెండేండ్లవతావుంది. నా బిడ్డలకాడికొచ్చేసరికి యింకా యేమేమవతాదో తల్చుకుంటేనే భయంగా వుంది..." అతడి కంఠం జీరబోయింది.

కాస్సేపు యిద్దరూ మాట్లాడలేదు.

చెప్పుల్లేని నాయుడి పాదాలు మట్టి బాటపైన దుమ్మును రేపుతూ ముందుకు సాగుతున్నాయి. నటరాజు తొడుక్కున్న హవాయి చెప్పులు టపటపా కొట్టుకుంటున్నాయి.

యిసుక మేటల్లాంటి యెండిన కొండ వాగుల్ని దాటి, పెద్ద పెద్ద దిబ్బల్లాంటి మట్టిగుట్టల మీదుగా సాగిన బండి బాట, పచ్చని మొలకైనా కనిపించని బండరాళ్ళ గుట్ట దగ్గరికొచ్చాక మలుపు తిరిగింది. మలుపు తిరిగిన వెంటనే మామిడి తోట కనిపించింది. తోటను చ... ...నే నాయుడిలో వుత్సాహం తొంగి చూసింది. "పదైదెకరాల తోట. మేము యిప్పుడొక యెకరాలో కొత్తగా లేదోట కూడా పెట్టినాంలే! పెద్దినాయుడి తోటంటే యీ పక్క తెలియనోడు లేడు." తోటకున్న ముళ్ళ కంచెలోంచి పెద్ద ముళ్ళ పొదను దూరంగా లాగి దారి చేసుకుని లోపలికి నడుస్తూ నాయుడు చెప్పసాగాడు — "యీ మొదులు పక్కంతా మా పెద్ద నాయన భాగానికొచ్చింది. ఆయనక్కూడా యిద్దురే కొడుకులు. వాళ్ళ భాగాలు పొయ్యి యిరవై యేండ్లవతావుంది. యీ భాగంలోనే అతి మధురం చెట్లు మూడుండాయి. యీ గెనిమ దాటితే మా రెండో పెదనాయన తోట. యీ గెనిమ పక్కనే పెద్ద పెద్ద నీలం చెట్లు వున్నాయి. పోయిన తడవ గంగజాతరప్పుడు గాలీవానా వచ్చినప్పుడు కొమ్మలిరిగిపోయి పడిపోయినాయి. ఆ తావులో మా పాలోళ్ళు బెంగుళూరు చెట్లు నాటినారు. యీ పుట్ట కాన్నించీ మా భాగం. యీ చక్కెర గుట్ల చెట్టు కాడి నుంచీ ఆ యాప చెట్టుదాంకా, ఆ పక్కుండేది యింకో పెద్దనాయనది. మొదుట్లో తోటంతా వొకా సామికే అమ్మతా వుంటిమి. యిప్పుడుండేవాళ్ళు పెద్దా చిన్నా యెంచేవాళ్ళు కాదు. యెవుడి భాగం వాళ్ళిష్ట మొచ్చినోడికి అమ్ముకుంటా వుండారు... భద్రంగారా అయివోరా! ఆ పక్కుండేది గుంతమకునేవు. అది బాయి. యిప్పుడు నీళ్ళు లేవులే! యెండిపోయి అయిదేండ్లయిపోయింది..."

తోటలోకి మనుషులొచ్చిన సందడి వినబడగానే "యెవురాడ?" అంటూ దూరం నుంచీ ప్రశ్న వినిపించింది. ప్రశ్న వినిపించిన వైపుకు తిరిగి "రామచంద్రుడూ! యిట్లా రాబ్బా! అయివోరొచ్చినాడు..." అంటూ కేకేశాడు నాయుడు.

యిద్దరూ మరికాస్త ముందుకు నడచారు. వో పెద్ద మామిడి చెట్టు కింద, సపారు పక్కన పిల్లలు ముగ్గురు కోడి పిల్లల్ని తరుముతూ ఆడుకుంటు న్నారు. సపారు పక్కనున్న రాతి తిన్నెపైన నాయుడి భార్య కూచుని వేరుశెనగ చెట్లలోంచీ కాయలు వొలుస్తోంది.

సపారులోంచీ నులక మంచం తీసుకొచ్చి బయట వేశాడు నాయుడు. నటరాజు కూర్చున్నాడు.

"నమస్కారం అయివోరా!" జోడించిన చేతులతో ముందుకు వస్తున్నాడు రామచంద్రుడు. అతడితో బాటూ గంగులు నాయుడి పెద్ద కొడుకు మునిరత్నంనాయుడు కూడా వస్తున్నాడు.

"యేం రామచంద్రా? మునెయ్యెక్కడ?" అని అడిగాడు నటరాజు.

"అదేందయివోరా! మండీకాడికి రాలేదా వాడు?" రామచంద్రుడు ఆశ్చర్యపోయాడు.

"నేను మొన్నొచ్చేసినానీపక్కకు. మునెయ్య మండీల కాడికెందుకు పొయివాడు?" నటరాజు కూడా విస్తుపోయాడు.

"అవుతే నీకీ సంగతి తెలవనే తెలవదా? మొన్న నాకూ వానికీ యవ్వారమైపోయింది. ముందే తెలుసుకుంటిని. లేకపొయ్యుంటే మాకు బొగిసొట్లయి పొయ్యుండు..." భుజం పైని టవలును నేలపైన పడేసి, దాని పక్కనే గొంతుక్కూచున్నాడు రామచంద్రుడు.

"యేం జరిగిందో చెప్పరా రామచంద్రా ముందు" అని గంగులునాయుడు విసుక్కున్నాడు.

"యీ జోగలోడ్ని నమ్మద్దని నేను ముందుగానే చెప్పినాను. మీ ఆసామి నా మాట యిన్లేదు. యిప్పుడేమయిందో చూసినావా అయివోరా!" మునిరత్నం నాయుడు మంచంపైన కూర్చుంటూ కళ్ళెగరేశాడు.

"ఆ యెగవ పక్క కయ్యలో పీతర్ చెట్లుండ్లేదా పెద్ద నాయనా!" రామచంద్రుడు చేతులు తిప్పతూ చెప్పసాగాడు— "ఈ చెట్లో కాయలు పండతా వుండాయని చెప్పినాను గదా నీతో! దాంట్లోంచీ చిలకల్నూ, చీకిరాళ్ళనూ తోలేదానికే సరిపోతావునింది దినమంతా. మొన్న సాయింత్రం పొద్దుగూకతా వుండే టప్పుడు ఆ పక్కకు పోయినాను. ఆ చెట్టుకు సరిగ్గా మొదలు దగ్గిర పాదులు తీసిన గుంత వునింది గదా! ఆ గుంతంతా యెండిన మామిడాకులు కనిపించి నాయి. ఆ ముందు దినందాకా నేల కనపడతా వున్న

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్

గుంత దాంట్లో మామిడాకు లెందుకు పోసినారబ్బా అనుకోని కాలితో అట్లా కలబెట్టినా. పెద్ద నాయనా! నువ్వు నిజమనుకో, జల్ల అనుకో, నా గుండెలట్నే అవిసిపోయినాయనుకో..."

"యేమునిందిరా గుంతలో" గంగులునాయుడు వుత్కంఠతతో ముందుకు వంగాడు.

"యేమునింది? మామిడి కాయలే! పండ్లు... అన్నీ పసుప్పచ్చగా కంటికి గోరగిస్తా వున్నాయి..." మునిరత్నంనాయుడు అదోలా నవ్వసాగాడు.

"ఆ పండ్లు జూస్తావుంటే నాకు భలే వుగ్ర మొచ్చేసిందయివోరా!" రామచంద్రుడ్ని మళ్ళీ ఆనాటి ఆవేశం ముంచెత్తినట్టుంది, అతడు లేచి నిల్చుని వూగిపోతూ చెప్పసాగాడు— "నేరుగా పోయి మునెయ్య చెయ్యి పట్టుకోని గుంత దగ్గిరికి గుంజక పోయి వొక అడిగినాను జూడూ — ఆ దొంగ నాయాలు నోరు తెరిస్తే వొట్టు. అప్పుడాడ్నే మునిరత్న మన్న గూడా వున్నాడు. కావాలంటే అడుగు. వొకా సామి, నమ్మి మన చేతిలో తోట పెడ్తే దాన్నెట్లా కాపాడాల్ల? వొక్కో పిందెనూ పసిబిడ్డను కాపాన్నెట్టు కాపాడాల్ల. యెట్నో నేను కాబట్టి, కంటి మింద రెప్పెయ్యకుండా పారాగాస్తా వుండాను కాబట్టి ఆ దొంగనాకొడుకును కనిపెట్టేసినాను. లేకపొయ్యుంటే యేమయ్యుండు? యీ పక్కంతా మా పెద్ద నాయనంటే ధర్మరాజని గదా అందురూ అనుకుంటా వుండారు. ఆ పేరుకే మోసమొచ్చుండును గదా! ఆయన తోట్లోనే చెయ్యి పెట్టినాడే, వాడెంత కంతిరీ గయ్యుండాల?..."

"ఆ నా కొడుకును యెందుకొదిలిపెట్టినారు? నేనొచ్చేదాకా చెట్టుకు కట్టేసుంటే యేమి? వాని జుట్టు గొరిగి, గాడిద మింద వూరేగింపు జెయ్యించుందును గదా!..." గంగులునాయుడు కోపంగా నిష్టూర పోయాడు.

"ఆ జోగలోడు అదృష్టం జేసుకున్నోడు. మొన్న సాయంత్రం నేనూ మునిరత్నమన్న వానికి పట్టుండే దెయ్యాన్ని వొదిలించి పారేసినామనుకో... కానీ వాడు సందుజూసుకోని జెళ్ళపిల్ల మాదిరి జారుకున్నాడు. నువ్వేమో సద్ది బస్సుకే ఫ్రాసుకు పోయినావంట. నిన్న పొద్దన మేమిద్దురూ సద్ది తాగే దానికి యింటికి పోయిన టయిం జూసి ఆ నా కొడుకు పెండ్లాంతో సహా బస్సెక్కేసినాడు. అయినా యాడికి పోతాడ్లే, రెండు నెలల జీతం రావాలగదా, నేరుగా మండీల కాడికే పొయ్యుంటాడ్లే అనుకుంటిని..." రామచంద్రుడు మళ్ళీ నేలపైన కూర్చుని తాపీగా జవాబు చెప్పాడు.

గంగులు నాయుడు వాళ్ళవైపు పరీక్షగా చూస్తూ, "యీ సంగతి విన్న రాత్రి గూడా యెవరూ చెప్పలేదే నాతో..." అని వాకబు చేశాడు.

"నీ కోడలుతో చెప్పినానే, నీతో చెప్పలేదా అది? గెవనం బెట్టుకోలేదేమో? అయినా పైకి చెప్పుకునే సంగతేనా యిది? పెద్ది నాయుడి తోట్లో కావిలోడే

## ఎవరామె

మా మహోత్సవ ప్రారంభ సంరంభంలో
మొక్క నాటుతుంటే ... కెమెరా... క్లిక్ మనడానికీ
ఏరెండకే నిగనిగల చెక్కిళ్ళు ఎరుపెక్కాయని
అక్కరలేదన్నా ... వినక ... పానీయం సేవించమని
ఓట్ల రాజకీయం ఒకొక్కటే పోటీ పడటానికీ
ఆమె ముఖ్యమంత్రిగారి భార్యా కాదు.
కలుపు మొక్క కానరాకుండా నాగలి క్రరు నడిపించి
చీకటిని చింతచెట్టుకు ఉరేసి
చంద్రుని సంపదను చేనంతా పరచి
ఏరువాక ముందే ఏరు పొంగు చూసి
పోటెత్తిన కదలిని నాటేసుకొనక ముందే
ముగుతాడు వేసి ... మడి చెక్కకు మళ్ళించిన
వ్యవసాయ కూలీ ఇల్లాలామె
నీరు కారే వరి మొక్కల గుప్పెట నుంచి
రెక్క పీకినా ... పాదాలు పాచి పట్టినా ... లెక్కించక
చెక్కిళ్లను జారే స్వేద ఝరులు
సూర్యుణ్ణి తమలో తళుక్కుమనిపిస్తూ
మంచి ముత్యాల్లా మడి చెక్కలో రాలగా
ఈమడి సారవంతమై
నాటిన మొక్క బారెడు దుబ్బేసి
క్రర బారెడెదిగి ... కంకి మూరడేయ
కార్తీక మాసాన కరువు నేలను కుంగ
రతనాల, రాజనాల రాసులెత్తిన పంట ఆకాశ మంటాలంటూ
మనసారా కోరుకుంటూ మొక్కనాటే...
ఆడ కూలీ మనిషామె
ఆమె అక్కరబడి ఆసామిని కూలడిగితే
దిక్కుమాలిన జాతికి సభ్యత తెలియదు
ఎక్కడ బడితే అక్కడ చేయి చాచడం దాని లక్షణం
అయినా మడిచెక్కను ... వీళ్లలా డబ్బుంటుందా? అంటే
మరునాడు ఇంటికెళ్లి చెప్పిన పని ఒక్కటే కాదనక చేసి
రెండవ నాడు చెక్కు మూర లేదంటే ... తిరిగొచ్చి
వారం రోజులు ఆసామి గెడప చెక్క దిగి, విసిగి
బూతులు కక్కుతూ ... ఉచితంగ ఇచ్చినట్లు
కూలి తక్కువిచ్చినా ... నోరిప్పక పుచ్చుకున్న
బక్క జాతి ... స్త్రీ ... ఆమె! ఆడ కూలీ మనిషామె!

— కొండపల్లి కోటేశ్వరమ్మ



దొంగతనం జేసినాడంటే మనకు అవుమానం గదా!" అన్నాడు మునిరత్నం నాయుడు.

కాస్సేపు మౌనంగా వుండిపోయి, తరువాత నిట్టూర్పు వదలిపెడుతూ "చూసినావా అయివోరా! రాంచంద్రునికి తోడుగా రాత్రుల్లో మా పెద్దోడ్ని గూడా తోడుండమని చెప్పినాను. ఇంక పనుల్లో అయితే పిల్లా జీమా, మా కుటుంబరమంతా తోట్లోనే వుంటాము. ఇంత పగడ్బందీగా యేర్పాటుచేస్తే మీ ఆసామి వాడెవుడ్నో జోగలోడ్ని తెచ్చి కాపలాకు పెట్టి నాడు. ముందే నా మాటిని వుంటే ఈ తగరారేవు నుండదు గదా!..." అన్నాడు గంగులు నాయుడు.

నటరాజు తలూపుతూ పైకి లేచి "వొకసారి తోటంతా తిరిగేసొద్దాం పద రామచంద్రా!" అన్నాడు.

"పోరా, రామచంద్రా! ఆ తూరుపుపక్క రుమానీ చెట్లో కాయల్ని చీకిరాళ్ళ తినేస్తా వుండాయి. గుమస్తా అయివోరికి చూపించు. పోయి వాళ్ల ఆసామికి చెప్తాడు" మునిరత్నం నాయుడు రామచంద్రుడికి సలహా చెప్పాడు.

రామచంద్రుడు దారి చూపుతుండగా నటరాజు తోటలోకి బయల్దేరాడు.

మామిడిచెట్ల చుట్టూ యెప్పుడో దున్ని పెట్టిన సాలల్లో పెరిగిన పిచ్చి చెట్ల మధ్య సన్నని కాలిబాటలో యిద్దరూ నడవసాగారు.

"ఆ మునెయ్యంటే మొదుట్నుంచీ నాకు అనుమానంగా వునిందయి వోరా!" అంటూ రామచంద్రుడు చెప్పుకుపోసాగాడు — "పొద్దన లేచి వూర్లోకి పోయి భంగాకు దెచ్చుకున్నాడంటే, ఇంక సాయంత్రం దాకా తాగతానే వుంటాడు. సాలని దానికి మొబ్బయ్యా గాక ముందే చుక్క పడాల్సిందే! ఆ పెండ్లాం పగుల్లో ఆ పక్క చేన్లల్లో చెనిక్కాయలు పెరికే పనికి పోతా వునింది. మధ్యానం అది తెచ్చిన సంగటే వీడూ తినేస్తా వున్నాడు. రాత్రుల్లో మాత్రమే అది వండతావునింది. కుయ్యో మొర్రో మంటా వుంటే మా పెద్దనాయనతో చెప్పి బియ్యం అప్పుగా తెచ్చిచ్చినాను. ఇంత సహాయం చేస్తే వాడు మాసినావా నాకే యెసురు పెట్టినాడు!..."

నీలం చెట్లకు కాసిన పిందెల్ని పరీక్షించుతూ నటరాజు "గంగులు నాయుడ్ని పెద్దనాయనని పిలస్తా వుండావు నువ్వు. నువ్వు గూడా నాయుడేనా రామచంద్రా?" అని ప్రశ్నించాడు.

"భలే మాటడిగినావయివోరా! గంగులునాయుడు నాకు సాయానా పెద్ద తాత కొడుకు. మేమంతా పాలోళ్లు. వూర్లో పెద్దనాయుడు మిద్దె అంటే యెవురయినా చూపిస్తారు. అద్నే మా యిల్లు..."

నటరజు రామచంద్రుడ్ని వోసారి యెగాదిగా చూసి "నాకీ సంగతి గంగులునాయుడు చెప్పనే లేదే!" అని ఆశ్చర్యపడ్డాడు.

"నేనేమయినా లక్సతినా అయివోరా, యెవురైనా నన్ను బందువని చెప్పుకునేదానికి? దుడ్డుంటే నన్ను గూడా అందురూ రామచంద్రనాయుడనో, చౌదరనో పిలుసుందురు..." రామచంద్రుడు నవ్వసాగాడు.

"అయివోరా నీతో వొక మాట చెప్పాల ..." నడుస్తున్న వాడల్లా ఆగి రహస్యం చెబుతున్నట్టుగా చెప్పాడు రామచంద్రుడు. నటరాజు గూడా ఆగి అతడి వైపుకు చూశాడు.

"ఆసామేమయినా దుడ్డు యిచ్చంపినాడా?" అని అడిగాతను.

నటరాజు లేదన్నట్టుగా తల అడ్డంగా వూపాడు.

"రెండు నెల్ల జీతం యియ్యాల. యింకా యాకపోతే మేమేమి తినాలయివోరా? ఈసారి నువ్వు కొంచెం గట్టిగా చెప్పాల ... ఇంకో మాట! నీ దగ్గిర దుడ్డం పిస్తానని చెప్పినాడు ఆసామి. నువ్వాదుడ్డు ఇంగెవురి చేతికీ ఇయ్యద్దు. నా దగ్గిరే యియ్యాల ... మా పెద్ద నాయనకు నేను కొంచెం బాకీ వుండాన్లే! యెట్లయినా నా జీతం రూకలు కొట్టెయ్యాలని వాళ్లాలోచన పెట్టుకోనుండారు. మాలో మాకు పెయ్యుంటాయి. నువ్వు మాత్రం రూకలు నా చేతే యియ్యాల. లేకపోతే వొప్పుకునేది లేదు..."

"ఆసామితో చెప్తానులే రామచంద్ర!" ముందుకు కదులుతూ అన్నాడు నటరాజు.

"చెప్పయివోరా! నా సంగతి కూడా చెప్పు ... నేను నికార్సయినోడ్ని. నీకీ మాట చెప్పినానని యెవురితో అనద్దు. నేను బందువులనీ అయినోళ్లనీ అనుకునేటోడ్ని గాదు. వీళ్ల రాత్రీ పగులూ యిడ్నే పడుంటారు. పిల్లకాయలు పొద్దస్తమానమూ తోట్లోనే తిరగతా వుంటారు. మా మునిరత్నమన్న కంత్రీ. యెట్లయినా పండ్లు తీసుకోని పొయ్యి ఆ దూదేకల సాయిబుకు అమ్మేద్దామని అనుకుంటా వుంటాడు. కానీ నేను అదంతా వొప్పుకునే మనిషి కాదు. రూకలు జీతంగా తీసుకునిందానికి ఫలితం చూపించాల. వాళ్లాట సాగడం లేదని మా వోళ్లకు నా పైన యిప్పటికే ముక్కులదాకా వుంది. కక్కలేక మింగలేకా వుండారు. యీ సంగతంతా ఆసామితో చెప్పు..."

"చెప్తాన్లే!" అని హామీ యిచ్చాడు నటరాజు.

"పోనీ, యిరవై ముప్పయి అయినా యిచ్చేసి అయివోరా! రేషన్లో బియ్యమిస్తా వుండారంట. తెచ్చుకోవాల..." రామచంద్రుడు ప్రాధేయపడ్డాడు.

నటరాజు అతడికి పది రూపాయల నోటునిస్తూ "ఆసామి నా దగ్గరేమీ పంపించలేదు. నువ్వు అవసరమంటా వుండావని యిస్తావుండాను. తోటను జాగ్రత్తగా చూసుకో... పనయిపోయినాక యినాం గూడా యిమ్మని చెప్తాను" అన్నాడు.

తోటంతా తిరిగి చూసిన తరువాత యిద్దరూ సపారు దగ్గిరికి వచ్చారు. నటరాజు మంచంపైన కూర్చుంటూ "మిగతా అన్ని తోటల్లోనూ రకాల కాయలు దింపిస్తా వుండాము. యీ తోటలో కాయలు కోసేదానికి యింకా యెన్నాళ్లు పడుతుంది?" అని అడిగాడు.

"అంతా చూసేసొచ్చినావు. నీకు తెలియలేదా అయివోరా?" అంటూ పెదవుల్ని సాగదీశాడు మునిరత్నం నాయుడు.

"నేనుద్యోగంలో చేరింది యీ సంవత్సరమే నాయుడూ! యిప్పుడిప్పుడే నేర్చుకుంటా వుండాను..."

"భలే గుమస్తాగా వుండావే నువ్వు... మామిడికాయల యాపారంలోకి దిగినాక యిట్టాంటి సంగతులు తెలుసుకోకుంటే యెట్ల చెప్పు?" గంగులు నాయుడు నవ్వేశాడు.

"తూరుప్పక్క రుమానీ చెట్టుల్లో కాయలు మాగతా వుండాయి. పీతర్‌గూడా కోసెయ్యచ్చు. యెంత బిన్నా కోసేస్తే అంత మేలు" యీసారి రామచంద్రుడే సమాధానం చెప్పాడు.

అయిదు నిముషాలు గడచాక పైకి లేచి "యింక నేను బయల్దేరతాను నాయుడూ! గబగబా నడిస్తే వొకటిన్నర గంట బస్సు దొరుకుతుంది" అన్నాడు నటరాజు.

"వుండయివోరా! మా కోడలు అన్నమెత్తుకోనొస్తాది. తినేసి పోదువు" అంది నాయుడి భార్య.

"లేదులేమ్మా! పోతాను ... పనుంది..." నటరాజు తన బట్టల కతుక్కున్న పల్లేరుగాయల్ని విదుల్చుకుంటూ సమాధానం చెప్పాడు.

"అయివోరికి మన సంగటీ సలిబిండీ సయిస్తాయా? క్రాసుకుపోయి మిల్ట్రీ హోటల్లో బిరియానీ తింటాడు గానీ! పదయివోరా! నేనూ అంతదాకా వస్తాను" అంటూ పైకి లేచాడు గంగులునాయుడు.

యిద్దరూ తోట బయటికొచ్చాక "అయివోరా, నీతో వొకమాట చెప్పాల... యేం లేదు. ఆ రాంచంద్రుడికి రెండు నెలలుగా జీతం యియ్యలేదు. కొంచెం మీ ఆసామితో చెప్పు..." అన్నాడతను.

"చెప్తాన్లే నాయుడూ!..."

"యింకోమాట! మీ సిద్దముని వానికి జీతం రూకలు పంపిస్తానన్నాడు. నువ్వు రూకలు వాని చేతిలో పొయ్యద్దు. వాడు తాగుబోతు. యెంత దొరికినా తాగి తలకుబోసుకుంటాడు. వాని పెండ్లాం నెత్తీ నోరూ కొట్టుకుంటుంది. రూకలంతా నాకే యియ్యి. వాడు నాక్కొంచెం బాకీ వుండాడు. నాకు రావల్సింది పట్టుకోని మిగిలింది వాని పెండ్లాం చేతిలో పెడ్తాను" అన్నాడు గంగులు నాయుడు.

***

వొకటిన్నరకు రావల్సిన బస్సు రెండుదాటిన తరువాత వచ్చింది. క్రాసులో భోజన కార్యక్రమాన్ని ముగించి, బస్సెక్కి వూరు చేరుకునేసరికి గంట నాలుగున్నర కావస్తోంది.

వూరికి ఫర్లాంగు దూరంలో యుద్ధం కోసం నిర్మించిన సైన్యపు గుడారాల్లా ముప్పయి నలభై మండీలు కొలువుదీరి వున్నాయి. అక్కడ నిజంగా తిరణాళ జరుగుతున్నట్టే వుంది. మండీల ముందు ట్రాక్టర్లు, బండ్లు, లారీలు బరాబరులు పలుకుతున్నాయి. వాహనాలు ఆక్రమించుకోగా మిగిలిన స్థలంలో మనుషులు అటూ యిటూ హడావుడిగా తిరుగుతున్నారు. తాత్కాలికంగా నిర్మించిన మిలిటరీ హోటళ్ళు రంగురంగుల సీరియల్ సెట్ల లైట్లతో, చిత్రవిచిత్రమైన శబ్దాలతోబాటూ సినిమా పాటల్ని గూడా ప్రసారం చేసే ఓపురికార్డులతో, అద్దాల పెట్టెల్లోంచీ బాహాటంగా కనిపిస్తున్న తినుబండారాల్తో కష్టమర్ల పైకి వలలు విసుర్తున్నాయి. తమ తమ గమ్యస్థానాల్ని చేరాలన్న నియమం తప్ప మరో నియమమేమీ లేనట్టుగా, యెటు వీలయితే అటు ముందుకురుకుతున్న మనుషుల్ని తప్పించుకుంటూ తమ మండీ వైపుకు నడుస్తున్న నటరాజు "అయివోరా!

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్

అయివోరా!" అన్న పిలుపు వినబడగానే నిలబడి చుట్టూ కలయజూశాడు.

టీ బంకు పక్క నుంచీ చేతులు రెండూ పైకెత్తి నమస్కారం చేస్తూ మునెయ్య నడచి వస్తున్నాడు. యెప్పుడూ వొంగి వుండడంచేత అతడెంత పొడ వుంటాడన్న విషయం స్పష్టంగా తెలియడం లేదు. కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్న తెలుపు నలుపు రంగుల మీసం అతడి శరీరానిదైనట్టుగా అనిపించడం లేదు. చాలా రోజులుగా తొడుక్కుంటున్న గళ్ళ లుంగీ, ఖాకీ చొక్కా దాదాపుగా అతడి శరీరంలో భాగాలైపోయి నట్టుగా వున్నాయి. అతడికి రెండు మీటర్ల దూరంలో అతడి నుంచీ వేరై నిల్చున్న నీడలా వెన్నంటే వస్తోంది అతడి భార్య. పెద్ద చెక్కపేడుకు చీరకట్టినట్టుగా వుంది ఆమె. గాజుగోలీల్లాంటి ఆమె కళ్ళు యేటు చూస్తున్నాయో యెవరికీ అంతుబట్టడం లేదు.

"నువ్విక్కడున్నావా మునెయ్యా! నిన్ను నమ్మి తోటకు కాపలా వుండమంటే, మాకే యెసురుబెట్టి నావే! మా కంట్లో కారం కొట్టి దొంగతనంగా కాయలమ్ముకుందామనుకుంటివా నువ్వు..." నటరాజు వెటకారం చేశాడు.

"నీతో ఆ మాదిరిగా చెప్పినారా అయివోరా వాళ్ళు... చూసినావా, కలియుగం అంటే యిదే గదా! ధర్మగోవు వొక పాదం పైన్నే నడస్తావుందని బ్రహ్మం గారు చెప్పిందిందుకే గదా!" అంటూ కాస్సేపు వేదాంతం మాట్లాడి, ఆ తరువాత "అసలు నిజ మేందో యినేవాళ్ళే లేకపోయిరే నాకు" అని వాపోయి, చివరకు తన వాదాన్ని వివరించసాగాడు మునెయ్య — "ఆ తోటోళ్ళూ రామచంద్రుడూ బంధుగులు. వాళ్ళూ వాళ్ళూ యేకమైపోయి, ఆసామి నోట్లో మట్టిగొట్టదామనుకుంటే అడ్డం పడిందే నా తప్పయి పోయిందవోరా! కాళ్ళ మీద పడినాను. తూత్తెరీ అనేసినారు. బలవంతంగా నన్నూ, మా ఆడోళ్ళనూ బస్సెక్కించేసినారు..."

నటరాజుకు కోపం వచ్చింది. యిక ఆపమన్నట్టుగా చేయి అడ్డంగా వూపుతూ "తప్పుడు మాటలు చెప్పద్దు. నువ్వు రుమాని పండ్లు దాచిపెట్టిన చోటు కూడా చూసినాన్నేను. దొంగ నమస్కారాలు పెడ్తే నువ్వేం చెప్పినా నమ్మేస్తా ననుకుంటివా?" అంటూ దబాయించాడు.

"నేనట్టాంటోణ్ణి గాదయివోరా! తోటగల్లోళ్ళు తల్చుకుంటే యేమయినా చేస్తారు. అడ్డమొస్తే యెంగి లాకును పారేసినట్టు పారేస్తారు. ఆసాములే కొంచెం మంచోడెవుడో చెడ్డోడెవుడో తెల్సుకోవాల. నన్ను గురించి కావాలంటే విచారించి చూడు. యీ వూళ్ళోనే షేక్ ముస్తఫా సాహేబుండాడు. ఆయ న్నడుగు. బందార్లపల్లెకాడ ఆరేండ్ల కాయన పెద్ద మామిడి తోటను అడమాణం బెట్టుకుంటే, ఆ ఆరేండ్లూ నేనే కావిలున్నాను. యెప్పుడైనా చిన్న పిందె దొంగతనం పొయ్యిందునా? యెప్పుడైనా పల్లెత్తు మాట యినుందునా? అంతేల? అరగొండ ముత్యాల నాయున్నడుగు. వాళ్ళ తోటలో మూడేండ్లున్నాను. నేనేగాదు. మా తమ్ముడు కొత్తపల్లికాడ యెన్ని సమత్స రాలుగా కావిలుండాడు. మేము అగ్గిమాదిరిగా వుండామే! మా నాయిన చుక్కలపల్లి సుందరరామిరెడ్డి తోట్లో పర్మినెంటు కావిలోడుగా వుండేటప్పుడు, యెప్పుడైనా చిలక తొక్కిన కాయయినా ఆశపడి నోట్లో బెట్టుకోనున్నా? యింత బతుకు బతికీ, యిన్నేళ్ళకు యిప్పుడు నిందబడాల్సి వొచ్చిందే నాకు..." మునెయ్య వాపోయాడు.

"ఆసామితో చెప్పినావా యిదంతా?" అని అడిగాడు నటరాజు.

"ఆ సంగతేమని చెప్పేది సామీ!" అతడు పెద్దగా నిట్టూర్పు వదలిపెట్టి చెప్పసాగాడు, "నిన్న మధ్యాన మొచ్చినోడ్ని... మండీలోకి పొయ్యి నిలబడితే నా ముఖం చూసే తీరికే లేకపోయింది గదా ఆసామికి? గంట నిలబడితి. రెండు గంటలయింది. యెవురో, జూసు ఫాక్టిరీవోళ్ళంట. వాళ్ళు పొయ్యేదాకా నాముఖం చూడనే లేదు. సాయింకాల మెప్పుడో నా పక్కకు జూసినాడు. 'ఆ తోటగల్లోళ్ళు అన్నాయం జేసినారు సామీ' అంటే నా పైన యెగిరి దూకినాడు. కొట్టం దొకటి తక్కువనుకో! వూరికేనే తరిమేసుంటూరా, నువ్వేమో జేసుంటావు, అని నిలేసినాడు. 'నిందెట్లా రానే వొచ్చింది. నాకు రావల్సిన రెండు నెల్ల జీతం యిచ్చెయ్యి సామీ! నా దారిని నేను పోతాను' అంటిని. 'పైసా గూడా యియ్యను. ముందు యేం తప్పుచేసి వచ్చినావో చెప్పు?' అనేసినాడు. 'అయివోరు తోటను చూసేదానికి పోయినాడు. వచ్చేదాకా నీ మూతి చూపించద్దు' అనేసినాడు. అప్పటినించీ నీ కోసరమే యెదురు చూస్తా వుండాము యెందుకులే సామీ! నాయానికి కాలం లేదు. నిన్నట్నించీ యిద్దరూ పస్తే వుండాము. టీకర్చుకు కూడా చిల్లరిచ్చే మనిషి లేక పోయినాడు. మా కష్టం కూడా మాకు దక్కేట్టు లేదు..."

"సరే సరేలే..." యిక చాలన్నట్టుగా అడ్డు తగిలాడు నటరాజు. "నువ్వేమో వాళ్ళను దొంగలం టావు. వాళ్ళు నిన్ను దొంగంటారు. యెవురు దొంగలో, యెవురు దొరలో యెవుడికి తెలుసు? మద్దిస్తం పెట్టి విచారణ జరిపేదేనా మా పని? నేనింకా ఆసామిని కలవలేదు. మండీకాడికిరా! మాట్లాడదాం..."

మండీ వరకూ అతడి వెనకే నడచాడు మునెయ్య. మునెయ్య వెనకే అతడి భార్య గూడా మరమనిషిలా కదలివచ్చింది. వాళ్ళిద్దరూ మండీ ముంగిట్లోనే ఆగి పోయారు. నటరాజు మాత్రం లోపలికి నడచాడు.

మండీ తూటువైపు ముఖద్వారం దగ్గర పెద్ద లారీ నిలబడి వుంది. లారీ బాడీలోని మామిడి కాయల్ని దాదాపు ముప్పయి మంది కూలీలు గంపలతో తెచ్చి మండీలో పోస్తున్నారు. మరో పెద్ద రాశి ముందు కూర్చున్న పనివాళ్ళు వెదురు బుట్టల్లో వరి గడ్డిని అమర్చి, మామిడి కాయల్ని పాక్ చేస్తున్నారు. మండీ లోపల, వొక చివర్లో రచ్చబండలా కట్టిన సిమెంటు అరుగుపైన, రంగు వెలసిన పాత యినప్పెట్టె పక్కన, తెల్లటి పరుపుపైన కూర్చుని వున్నాడు సిద్దముని. ఖాతా పుస్తకంలో లెక్కలు వేసుకుంటూనే, ముందు కూర్చున్న వ్యక్తితో హిందీలో మాట్లాడుతున్నాడు. అరుగుపైన, గోరవార చేరగిలబడిన వ్యక్తి యెర్రగా, బొద్దుగా, బట్టలు తొడుక్కున్న టమేటా పండులాగు న్నాడు. నటరాజు అరుగు పక్కన నిల్చున్నాడు. సిద్దముని కూచోమన్నట్టుగా సైగచేశాడు. అయిదారు నిముషాల తరువాత "అచ్చా షేఠ్, అచ్చా షేఠ్" అంటూ అతడికి వీడ్కోలు చెప్పిన తరువాత, "చెప్పయివోరా! యెట్లా వుండాయి మిట్టూరు పక్క తోపులు?" అని అడిగాడు.

"కొత్తపల్లి దగ్గరుండే తోపులో రకరకాల కాయల సైజు బా గుందన్నా! కానీ మొరవపల్లి తోట్లో యింకా సైజు రాలేదు. రెండు చక్కెరి గుట్ల చెట్లల్లోంచీ కాయలు మాగి రాలిపోతా వుండాయి. చిన్న రావూరులో మాత్రం రకాల కాయల్ని రేపు కూడా కోసెయ్యొచ్చు. గంగులునాయుడి తోట్లో పీతరూ, రుమానీ దించెయ్యొచ్చు. ఆ పక్క వానలు తక్కువ. అందుకని ఆ తోపుల్లో బెంగుళూరు మామిడి కాయలు సైజు రాలేదు..."

"యీ సమత్సరం అన్ని తోటల్లోనూ సైజు అంతంత మాత్రంగానే వుందిలే అయివోరా! సైజుంటే రేటుండదు. రేటుంటే సైజుండదు. రేపు

[redacted]

(మిగతా 38వ పేజీలో)

ఒకసారి చదివితే చాలా కాలం పాటు మనసులో నిలిచిపోయే కథలు మాటిమాటికీ గుర్తుకొచ్చే కథలు, మన ఆలోచనల్ని వెంటాడే కథలు ఇటీవలి కాలంలో అరుదై పోయాయి. నిజానికి ఏ కాలంలోనైనా మంచి కథలు తక్కువే వస్తాయి. అయితే లోగడ నాలుగైదు పత్రికలు దగ్గరేసుకుని తిరగేస్తే ఒక మంచి కథైనా దొరికేది. ఇప్పుడు [illegible] పత్రికలు ముందేసుకుని ఎంత వెతికినా ఒక్క మంచి కథా దొరకడం లేదు.

— శీలా వీర్రాజు

సేకరణ: తవుటు నాగభూషణం

[redacted]

(ఈ వారం కథ 35వ పేజీ తరువాయి)

లారీతో పొయ్యి రకాలన్నీ కొయ్యించెయ్యి. మొన్నాటి తెల్లారికంతా లోడు మండీ ముందుండాల. మాగతా వుండే కాయల్ని యేదో ధరకు యాడ్నో అమ్మేసి, మిగిలినవాట్ని పేక్‌చేసి, లారీ కెత్తేద్దాం. అహమ్మదా బాదులో రేటు బాగుండాదని షేటు అంటావుండాడు. రేపు రెడీగా వుండమని లారీ డ్రయివరుతో చెప్పు. కోతలోళ్ళని రెడీ చెయ్యమని మస్తానుకు చెప్పు" గబగబా వుత్తర్వులు జారీ చేశాడు సిద్దముని.

నటరాజు పైకి లేచి అక్కడే నిల్చున్నాడు.

రెండు నిముషాల తరువాత పుస్తకంలోంచీ తల పైకెత్తి చూసి "యేం అయినోరా, యింకా యిక్కడ్నే వుండావు? యేమయినా చెప్పేదుండా?" అని అడిగాడతను.

"అదేన్నా, ఆ గంగులునాయుడి తోటలో కాపలా మనిషి… ఆజోగల మునెయ్య మిమ్మల్ని కలిసినాడేమో అని…" నటరాజు గొణిగాడు.

"ఆ దొంగనాయాలు మాట నా ముందెత్తద్దు. యిదేన్న యాడ్నో అఘోరిస్తా వుండాడు. యేట్లో దూకమను…" యిక మాట్లాడేందుకేమీ లేదని తేల్చిపారేస్తూ ముఖాన్ని ఖాతా పుస్తకంలోకి దూర్చేశాడు సిద్దముని.

నటరాజు లారీ డ్రయివర్ని వెతకడం కోసం మండీ బయటికొచ్చాడు.

"అయినోరా, అయినోరా! షావుకారేమంటా వుండాడు?" అంటూ ముందుగు పరిగెత్తుకొచ్చాడు మునెయ్య. అతడికి రెండు మీటర్ల దూరం లోపలే వుండాలన్న నియమాన్ని వుల్లంఘించకుండా, అతడి భార్య గూడా ముందుకొచ్చి నిల్చుంది.

"లాభం లేదుమునెయ్యా! నీ మాటెత్తితేనే ఆసామి వుగ్రనరసింహుడైపోతా వున్నాడు. యింకొంచెం సేపు వోపిక పట్టు. ఆయన శాంతపడినాక మాట్లాడదాం" అన్నాడు నటరాజు.

"యాలోక మెట్లయిపోయిందో చూసినావా అయినోరా! నిన్న పొద్దున్నించీ యెండలో పడి అఘోరిస్తా వుండామే! నేనేమయినా దానాధర్మంగా దుడ్డిమ్మంటావుంటే నీ కాలి చెప్పుతో కొట్టు వొప్పుకుంటాను. చేసిన పనికి జీతమిమ్మంటే తప్పేముండాది? నా మింద అనుమానంగా వుంటే పోదాం పద. ఆ గంగులునాయుడు తోట్లోనే మద్దిస్తం పెడ్దాం. పది మంది పెద్దోళ్ళు నాదే తప్పని తేల్చినారంటే, వాళ్ళెంత తప్పేస్తే అంత అపరాధం నేనే కడతాను. అంతేగానీ యిట్లా గుంటకీ మిట్టకూ యీడిస్తే నే నొప్పు కోను…"

"యీమాటలన్నీ నాతో మాటాడితే లాభం లేదు మునెయ్యా!" నటరాజు విసుక్కున్నాడు. జేబులోంచి అయిదు రూపాయల నోటు తీసి అతడికిస్తూ "నిన్నట్నించీ యెంగిలిపడలేదని అన్నావు గదా! హోటలుకు పోయి యేదయినా తినేసి రండి. నా క్కొంచెం పనుంది. గంటలో వస్తాను. అప్పటికేమయినా ఆసామి మనసు మారుతుందేమో చూద్దాం" అనేసి అక్కడి నుంచీ వచ్చేశాడు.

బ్రోకరాఫీసు దగ్గరి కెళ్ళి లారీ డ్రయివర్ని కలిసి పెట్టేసరికి గంట యేడయింది. వుదయం ఆరింటికంతా ప్రయాణానికి రెడీ వుండమని అతడ్ని హెచ్చరించి మండీ దగ్గరికి తిరిగొచ్చాడు నటరాజు. అప్పటికి బాగా చీకటి పడిపోయింది. ట్యూబులైట్ల వెలుతుర్లో పనివాళ్ళు తమ పనుల్ని చకచకా చేసుకుపోతున్నారు.

"డ్రైవరు రెడీగా వుంటాడన్నా! మస్తాన్ సాహెబింకా కనపడ్లేదు. ఆయనతో కోతలోళ్ళని రెడీ చెయ్యమని చెప్పేస్తే సరయిపోయినట్టే…" అని సిద్దమునికి వివరించాడు నటరాజు.

ఆ సమయంలో సిద్దముని వొంటరిగానే వున్నాడు. గయ్యమని శబ్దం చేస్తూ తిరుగుతున్న ఫాను కింద, తెల్లటి దిండుకు చేరగిలబడి విశ్రాంతి తీసుకుంటున్నాడతను.

"కుచ్చో అయినోరా! మస్తానొస్తాడేమో చూద్దాం. రెస్టు తీసుకో! బాగా అలిసిపొయ్యుంటావు…" అని నటరాజు కేసి చూసి చిరునవ్వు నవ్వాడు.

నటరాజు కూర్చున్నాడు.

"యీ మాంగో బిజినెస్ యెప్పుడూ యింతే అయినోరా! సమనిందంటే యింక గుక్కతిప్పుకోలేం. లేనప్పుడు యేం చెయ్యాల్నో తోచదు. అయినా యిప్పుడేం చూసినావులే! బెంగుళూరు కాయల్ని కొయడం మొదలుపెట్టినామంటే, జ్యూస్ ఫ్యాక్టరీవాళ్ళు మనల్ని వూపిరి తిప్పుకోనియ్యరు. యిప్పుడు కాదర్ కాయలకు గిరాకీగా వుంది. కానీ యేంచేద్దాం. కాపు లేదు" స్వగతంలా చెప్పుకుపోతున్న సిద్దముని ప్రశాంత వదనం వున్నట్టుండి వివర్ణమైపోయింది. కళ్ళు వురిమి చూడసాగాయి. అంతవరకూ అతడివైపే తన దృష్టిని కేంద్రీకరించి చూస్తూ వుండిపోయిన నటరాజు కంగారుపడుతూ తిరిగి చూశాడు.

"యిహిహీ" అని అతి ప్రయత్నం మీద పెదవుల పైకి నవ్వును కొనితెచ్చుకుని, బాగా ముందుకు వొంగి, రెండు చేతులూ పైకెత్తి జోడిస్తున్నాడు మునెయ్య. వెనకే, దీపాలు వెలగని ఖాళీ చిమ్నీల్లాంటి కళ్ళతో నిలబడి వుంది అతడి భార్య.

"యేంరా? మళ్ళా యెందుకొచ్చినావ్?" సిద్దముని గద్దించాడు.

"నీ కాడికిరాకుండా యాడికి పోతామన్నా? కొట్టినా నువ్వే కొట్టాల, పెట్టినా నువ్వే పెట్టాల" మాటల్ని సాగదీస్తూ సమాధానం చెప్పాడు మునెయ్య.

"నమ్మకంగా కాపలా గాయరా అంటే తోటంతా వాళ్ళ యెదానేసి వచ్చేస్తావా? నా ముందు నిలబడద్దు. పో బయటికి. పోతావా పోవా? పోలీసుల్ని పిలిపించి జైల్లో తొయ్యిస్తాను యింకా అట్నే నిలబడినావంటే…"

సిమెంటు దిన్నె ముందుకు వచ్చి "నేనేం చేసేదన్నా! వాళ్ళూ వాళ్ళూ బంధువులు. బలంతంగా మమ్మల్ని తరిమేసినారు" అన్నాడు మునెయ్య.

"అందుకే గదరా నిన్ను కాపలా పెట్టింది? నువ్విట్లొచ్చేస్తే వాళ్ళిద్దరూ కలిసి తోటనంతా మింగేస్తారు. లక్షలు పెట్టి కొన్నోళ్ళు మేమేమి పోవాల్రా బాడకోవ్?" యీసారి సిద్దముని పైకి లేచి కోపంతో పిడికిళ్ళు బిగించాడు.

"నీకు చెప్పేదానికి నోరు రాలేదుగానీ, వాళ్ళ పోరు పడేదానికి నావల్ల గాలేదన్నా! యెట్ల చెప్పేదని గొమ్మునుండాను. యింక చెప్పక తప్పేట్టు లేదు. ఆ రామచంద్రుడు నా పెండ్లాం కొంగు పట్టుకొని లాగినాడు. వాళ్ళంతా వొకటి కొకటే! నా గోడెవ్వరింటారు? ఆడ బతకలేక పరిగెత్తుకొచ్చేసినాను…" అంటూ మరికాస్త ముందుకొచ్చాడు మునెయ్య.

"నిన్ను నమ్మినా నమ్మను" సిద్దముని బిగించిన పిడికిలితో సిమెంటు దిన్నెపైన్నుంచీ కిందికి దూకేశాడు. పొట్టిగా, లావుగా, అయిదడుగుల బీరువాలా వున్న అతడి శరీరం కోపంతో వూగిపోతోంది– "తప్పుడు నా కొడకా! చంపేస్తాను. పాతిపెట్టేస్తాను. పో! బయటికి పో! లేకపోతే మండీకి బలిచ్చేస్తాను" గసబోస్తూ అరవసాగాడతను.

నటరాజు గుండె దడదడా కొట్టుకోసాగింది. బిక్కు బిక్కుమంటూ లేచి నిల్చుని మునెయ్య భార్యకేసి చూశాడు. ఆమె ముఖంలో మాత్రం యే మార్పూ కనిపించ లేదు. అదే చూపు…నడచే బొమ్మలా నిలబడి వుంది ఆమె. మునెయ్య మాత్రం బాగా బెదిరిపోయాడు. గబగబా మండీ బయటికి పరిగెత్తాడు. వెనకే అతడి భార్య కూడా వెళ్ళిపోయింది.

"నన్నే మోసం చెయ్యాలనుకుంటావుండావా వుండాకోర్! నీ మాదిరి మనుషుల్ని యెందర్ని చూసుంటాను నేను. పనిచేసే దానికి వగలేదుగానీ చెయ్యి వంకలు పెడ్తావా నువ్వు! నరికేస్తాన్నాయాలా!" మునెయ్య వెళ్ళిపోయిన తరువాత కూడా కాస్సేపటి వరకు సిద్దముని తిడుతూనే వుండిపోయాడు. తరువాత వెనక్కు తిరిగి, కడవలోంచీ గ్లాసు నీళ్ళు ముంచుకుని గుట గుటా తాగేశాడు. పై కండువాతో ముఖం తుడుచుకుని, తన స్థానంలోకొచ్చి కూర్చున్నాడు. దిండుపైకి వాలిపోయి, పెద్దగా నిట్టూర్పు వదిలిపెట్టి, పెద్ద విషయమేమీ జరగనట్టుగా చిరునవ్వు నవ్వాడు.

"కుచ్చో అయినోరా! భయపడిపోయినావా నువ్వు కూడా!" అని పెద్దగా నవ్వి "పర్వాలేదులే కుచ్చో! యెవుడెవుడితో యెట్ల మాట్లాడాల్నో తెల్సుకోకపోతే, యీ వ్యాపారంలో వూది పారేస్తారందరూ…" అని అన్నాడు.

నటరాజు జంకుతూనే సిమెంటు దిన్నెపైన

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

